సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ı 16 ı సెప్టెంబర్ ı 2025



మా మొర ఆలకించండి సారూ..
మా కష్టాలు, కన్నీళ్లకు కారణమైన సమస్యలను పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. మీరన్నా మా మొర ఆలకించండి..అంటూ బాధితులు జేసీకి విజ్ఞప్తి చేశారు.
-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,12,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,148
3 శాతం జీఎస్టీతో	రూ.10,452
నవర (8 గ్రా)	రూ.83,616

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /27.8

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉరుములు, మెరుపులతో మేఘావృత వాతావరణం ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

657 మందికే డీఎస్సీ పోస్టింగ్‌లు

- 673 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- అభ్యర్థులు లేరని 16 పోస్టులు ఖాళీ

నెల్లూరు (టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా 657 మందికే డీఎస్సీ పోస్టింగ్‌లు లభించాయి. మరో 16 పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులు లేరంటూ ఎగనామం పెట్టారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన చూస్తే అత్యధిక పోస్టులు ఖాళీ ఉంటే.. ఏడాదికిపైగా వాయిదాల మీద వాయిదాలు వేసి చివరకు కుదించి.. కుదించి 673 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 31,221 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జూన్ 6వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. అయితే తాజాగా సోమవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తుది జాబితాను విడుదల చేసింది. జిల్లాకు కేటాయించిన మొత్తం 673 పోస్టుల్లో 668 స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పీఈటీలు కాగా మరో 5 పోస్టులు ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించినవి ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ పోస్టులు జోన్‌ల వారీగా కేటాయించేడంతో చివరకు జిల్లాలో 668 పోస్టులను పరిగణలోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఏ (తెలుగు)-39, ఎస్‌ఏ (హిందీ)-18, ఎస్‌ఏ (ఇంగ్లిష్)-84, ఎస్‌ఏ (మ్యాథ్స్)-63, ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్)-76, ఎస్‌ఏ (బయాలజికల్ సైన్స్)- 63, ఎస్‌ఏ (సోషల్ స్టడీస్)-103, ఎస్‌ఏ (పీఈటీ)-107, ఎస్జీటీలు-115 పోస్టులతోపాటు మరో 5 ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి పోస్టులు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అయితే ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించిన 5 పోస్టులు జోన్‌లకు కేటాయించారు. మిగిలిన 668 పోస్టులకు సంబంధించి 657 మందినే ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. మరో 16 పోస్టులను ఆయా రిజర్వేషన్ల కేటగిరీ వారీగా అభ్యర్థులు లేరని ఖాళీగానే ఉంచారు. మిగిలిన పోస్టులను వచ్చే డీఎస్సీలో ప్రకటించనున్నట్లు తెలిసింది. ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న విజయవాడలో సీఎం చంద్రబాబు నియామక పత్రాలను అందజేయనున్నారు.

18న రిపోర్టు చేయాలి
మెగా డీఎస్సీ తుది జాబితా మేరకు ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా విద్యాశాఖాధికారికి రిపోర్టు చేయాలని డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థితోపాటు ఒక సహచరుడిని అనుమతిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. ఐడీ కార్డులు తీసుకోని అభ్యర్థులను 19న జరిగే సీఎం కార్యక్రమానికి అనుమతించరని చెప్పారు. అభ్యర్థులందరిని ప్రత్యేక బస్సుల్లో విజయవాడ తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వాల్లోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' మీడియా ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ చర్యలు, తప్పులను తప్పుగా పత్రికలు ఎత్తిచూపడాన్ని ప్రస్తుత పాలకులు ఓర్చుకోలేకపోతున్నారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాల్లో ఒకటిగా పరిగణింపబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనం. పోలీస్ అధికారుల హక్కులను కాపాడేందుకే రాసిన కథనంపై 'సాక్షి'పై అక్రమ కేసు పెట్టడం హాస్యాస్పదంగా ఉంది. ప్రజాస్వామ్యవాదులు ఈ పరిణామాలను తీవ్రంగా ఖండించాలి.
– బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ



అక్రమ కేసులు పెట్టడం దారుణం



కూటమి ప్రభుత్వం అరాచకాలు, అక్రమాలపై ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'సాక్షి' పత్రికపై అక్కసుతో అక్రమ కేసులు పెట్టడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంటే.. పోలీసులు అందుకు వంతపాడడడం శోచనీయం. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాల్గో స్తంభమైన మీడియాలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయి. కూటమి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు 'సాక్షి' వెలుగులోకి తెస్తోంది. దీంతో ఆ పత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తూ పోలీసులతో అక్రమ కేసులు పెట్టడం దారుణం. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వం ఇటువంటి కక్షపూరిత చర్యలకు పాల్పడలేదు.
– ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి

ధాన్యం కొనే దిక్కేదీ?

అరుగాలం శ్రమించి వరి సాగు చేసిన రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. తాజాగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఈ సీజన్‌లో పండించిన పంటను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను మిల్లర్లు, దళారుల దోపిడీకి వదిలేసింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గత రబీ సీజన్‌లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) ఏర్పాటు చేసినా.. అరకొరగా కొనుగోలు చేసి రైతులను నట్టేట ముంచేసింది.

జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం
- 5 లక్షల ఎకరాల్లో సాగు
- ఇప్పటికీ పీపీసీల ఏర్పాటుపై స్పందించని ప్రభుత్వం
- పుట్టి రూ.13 వేలు నుంచి రూ.15 వేలకే కొనుగోలు చేస్తున్న దళారులు, మిల్లర్లు
- మద్దతు ధర ప్రకారం పుట్టి ధాన్యం రూ.20,187
- వైఎస్సార్‌సీపీ పాలనలో పుట్టి ధాన్యం రూ.22 వేల నుంచి రూ.24 వేలు


దళారులకు కల్లాంలోనే ధాన్యం విక్రయాలు


ఇటీవల వర్షానికి పెనుబల్లి వద్ద నేలబడిన వరి

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఎడగారుగా 5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో కోతలు జరిగే అవకాశం ఉంది. అయితే ఇంత వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) ఏర్పాటు చేయడం లేదు. ఇదే అదనుగా దళారులు, మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారు. కేంద్రం ఇటీవల ధాన్యానికి ఏ-గ్రేడ్ క్వింటా రూ.2,389, సాధారణ రకం రూ.2,369 మద్దతు ధరలను సవరించింది. ఈ లెక్కన పుట్టి (845 కేజీలు) ఏ- గ్రేడ్ రకం రూ.20,187 ఉంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఏ-గ్రేడ్ రకమే రైతులు సాగు చేశారు.

దారుణంగా ధరలు పతనం
మద్దత ధర పుట్టి రూ.20,187 ఉన్నప్పటికీ మిల్లర్లు రూ.13 వేల నుంచి రూ.15 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. రైతులు, రైతు సంఘాలు ధాన్యం ధరలపై గగ్గోలు పెడుతున్నా.. జిల్లా అధికార యంత్రాంగం కనీసం స్పందించడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో కోతలు వచ్చే సరికి ధరలు మరింత తగ్గించేస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కనీసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే.. కనీస ధరలు అయినా దక్కుతాయని రైతులు ఆశ పడుతున్నారు. రబీ సీజన్‌లో మిల్లర్లు, దళారులు రైతులను దోచుకున్నా.. పట్టించుకోలేదు. అప్పట్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా మొక్కుబడిగా కొనుగోలు చేయడంతో పండించిన 98 శాతం పంటను రైతులు మిల్లర్లు, దళారులు అడిగిన ధరకు విక్రయించుకున్నారు.

వణికిస్తున్న వానలు
వరి సాగు చేసిన రైతులు ధరలు లేక ఆందోళనలో ఉంటే.. తాజాగా అల్పపీడన ప్రభావంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం నిలువు పంటపై ఉన్న పైరు నేల కొరిగిపోతోంది. ముందుగా వరి పంట సాగు చేసిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పుట్టి రూ.24 వేలు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ధాన్యం ధరలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా విక్రయించుకున్నారు. అప్పటి ప్రభుత్వం పక్క జిల్లాల నుంచి మిల్లర్లను ఆహ్వానించడంతోపాటు కచ్చితంగా ఆర్బీకేలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్ముకోవచ్చని నిబంధనలు పెట్టింది. దీంతో జిల్లాలోని మిల్లర్లు, దళారులు రైతుల నుంచి పుట్టి రూ.24 వేల వరకు కొనుగోలు చేశారు. చివరి కోతల సమయానికి కూడా రూ.22 వేల వరకు విక్రయించుకోవడంలో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమని రైతులు అప్పట్లో సంతోషం వ్యక్తం చేశారు.


కోవూరు సమీపంలో వరి కోతలు

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి
ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు తక్కువగా ఉన్నాయి. రాబోయే రోజుల్లో ధాన్యం ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్ ధరతో పోల్చుకుంటే ప్రభుత్వ మద్దతు ధర అధికంగా ఉంది. ప్రభుత్వం సీఎంఆర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించి ధాన్యం కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరి కోతలు ఊపందుకోక ముందే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకొని రైతుల ప్రయోజనాలను కాపాడాలి.
– కోటిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం
ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం అనుమతి వస్తే ధాన్యం కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం రూ.50 కోట్లు బ్యాంకు గ్యారెంటీ సేకరించి ఉన్నాయి. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం. ఇతర జిల్లాల రైస్ మిల్లర్లను పిలిపించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతాం. ఇతర జిల్లాల రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాం. ధాన్యం కొనుగోలు చేయడానికి ఇతర జిల్లాల రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారు.
– విజయకుమార్, డీఎస్‌ఓ



నాగరాజుతోపులో మహిళను,మైపాడు తూర్పుపాళెంలో కార్యకర్తను పరామర్శిస్తున్న నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రక్తమోడేలా పోలీసుల లాఠీచార్జి

- మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
- గాయపడిన కార్యకర్తలకు పరామర్శ

ఇందుకూరుపేట: టీడీపీ గూండాలు నా ఇంట్లో చేసిన విధ్వంసం తర్వాత నా కుటుంబాన్ని పరామర్శించేందుకు మా పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 31న నెల్లూరుకు వచ్చిన సందర్భంలో తమ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసులు రక్తమోడేలా లాఠీచార్జి చేశారని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల లాఠీచార్జిలో గాయపడిన సోమవారం మండలంలోని మైపాడు, నాగరాజుతోపు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ప్రసన్న పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలు ఎక్కడైనా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారా? పోలీసుల విధులకు అడ్డుపడ్డారా? పోలీసులు ఎందుకు విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసమే తమ పార్టీ కార్యకర్తలు అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందాల్సి వచ్చిందన్నారు. గాయపడిన ప్రతి కార్యకర్తను వారి ఇళ్లలోనే కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పార్టీ తరఫున అన్నివిధాలా అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. ప్రసన్న రాకతో ఆయా గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర రెడ్డి, మైపాడు సర్పంచ్ వెంకయ్య, నియోజకవర్గ వైఎస్సార్ టీయూ అధ్యక్షుడు బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి


ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అజిత వేజెండ్ల


సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

- ఎస్పీ అజిత వేజెండ్ల
- నూతన ఎస్పీగా బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (క్రైమ్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ వారికి మెరుగైన శాంతిభద్రతలు అందిస్తానని జిల్లా నూతన ఎస్పీ అజిత వేజెండ్ల చెప్పారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఎప్పుడైనా నిర్భయంగా తనను కలవొచ్చని చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అజిత మాట్లాడుతూ నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగంగా న్యాయం అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మహిళల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత నిస్తామన్నారు. శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని, యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజాజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, నేరచరిత కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈగల్ బృందాన్ని సమన్వయం చేసుకుంటూ మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో కట్టడి చేస్తామన్నారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి పోలీసుశాఖపై విశ్వాసాన్ని పెంపొందిస్తామన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని వర్గాల సహకారం ఎంతో అవసరమన్నారు. తొలుత ఆమె సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, పోలీసు అధికారుల సంఘ నాయకులు, మినిస్టీరియల్ సిబ్బందికి ఆమెకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిస్థితులపై ఆమె డీఎస్పీల నుంచి వివరాలు సేకరించారు.

టీడీపీలో వర్గపోరు బట్టబయలు


వాగ్వాదం పడుతున్న టీడీపీ నాయకులు

మర్రిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత, కొత్త టీడీపీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు ప్రతి విషయంలో బహిర్గతమవుతోంది. విచారణ అధికారుల సాక్షిగా టీడీపీలో వర్గపోరు బట్టబయలైంది. మండలంలోని కంపసముద్రం ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ డబ్బుగొట్టు వెంకటసుబ్బయ్య అవినీతికి పాల్పడుతున్నాడంటూ గ్రామానికి చెందిన టీడీపీలోని ఓ వర్గానికి చెందిన స్వాతిరెడ్డి గత సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ పీ వెంకట నారాయణ ఈ సోమవారం విచారణకు వచ్చారు. మరో వర్గం నాయకులు విచారణ ప్రాంతానికి చేరుకుని విచారణను అడ్డుకున్నారు. ఫీల్డ్అసిస్టెంట్ విధులు సక్రమంగానే చేస్తున్నారని, అతనిపై ఎలాంటి విచారణ చేపట్టాల్సిన అవసరం లేదంటూ అధికారులకు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న ఫిర్యాదు చేసిన టీడీపీ వర్గం నాయకులతో మాటల యుద్ధం జరిగింది. ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను బయటకు పంపించేశారు.

పెన్నాతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి


బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంగం: సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజ్‌కు వస్తున్న 32 వేల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నామని, పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈ విజయరామిరెడ్డి తెలిపారు. సంగం బ్యారేజ్ నుంచి సోమవారం ఆయన నీటిని దిగువ పెన్నాకు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సోమశిల నుంచి బ్యారేజ్‌కు 20 వేల క్యూసెక్కులు వస్తున్నాయని, అందులో బెజవాడ పాపిరెడ్డి కాలువకు 550 క్యూసెక్కులు, నెల్లూరు బ్యారేజ్‌కు 19,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. సాయంత్రానికి 30 వేల క్యూసెక్కులకు పైగా మట్టం పెరుగుతుందని, 24 గేట్లు ఎత్తి పూర్తి స్థాయిలో దిగువకు విడుదల చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. దిగువ ఉన్న వీర్లగుడిపాడు, కోలగట్ల, పడమటి పాళెం, పల్లిపాళెం, మక్తాపురం, అన్నారెడ్డిపాళెంతోపాటు జిల్లా వ్యాప్తంగా పెన్నానది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినయ్‌కుమార్, అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, నేతలు బీ శ్రీనివాసులరెడ్డి, జీ శ్రీనివాసులుయాదవ్, ఎస్సై రాజేష్, ఆర్‌ఐ సల్మా, బ్యారేజ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాకు 26,500 క్యూసెక్కులు
సోమశిల: జలాశయం నుంచి పెన్నాకు 5, 6 క్రస్ట్ గేట్ల ద్వారా 26,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 29,588 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం 74.420 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నానదితోపాటు ఉత్తరకాలువకు 400, కండలేరుకు 10,550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 77,893 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,604 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.3.53 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

క్లుప్తంగా

వేగంగా స్పందించి.. కాపాడి..



నెల్లూరు (వీఆర్సీ సెంటర్): సోమశిల నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నెల్లూరులోని జాతీయ రహదారిపై ఉన్న పెన్నా బ్రిడ్జి కింద 14 మంది యువకులు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది, నవాబుపేట పోలీసులు రంగంలోకి దిగారు. రోప్ ద్వారా వారికి బయటకు తీశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి మృతి

కావలి(అల్లూరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కావలి మండలం గౌరవరం గ్రామ సమీపంలోని నర్సరీ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ సీఐ రాజేశ్వరరావు సోమవారం వివరాలు వెల్లడించారు. ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి చనిపోయాడు. అతని వయసు సుమారు 35 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.150
లేయర్	రూ.115
బ్రాయిలర్ చికెన్:	రూ.264
స్కిన్‌లెస్ చికెన్:	రూ.290
లేయర్ చికెన్:	రూ.195



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15





పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే..

సాక్షి పత్రికపై ప్రభుత్వం కక్షగట్టి వరుసగా కేసులను నమోదు చేయడమే కాక కార్యాలయానికి వెళ్లి సోదాలు చేయడం నిరంకుశమే అవుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం కొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తోంది. ఇలాంటి పరిణామాలను అందరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పచ్చా మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు



కక్ష సాధింపు సరికాదు



ప్రభుత్వాలకు అనుకూలంగా రాస్తే ఒకలా, వాస్తవాలను చూపుతూ ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే మరొకలా వ్యవహరించడం కూటమి పాలకులకు న్యాయం కాదు. సాక్షి దినపత్రిక వెలుగులోకి తెస్తున్న ప్రభుత్వ తప్పిదాలను పరిశీలించి సరిచేసుకోవాలే తప్ప కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు.

– కె.దేవిడ్‌రాజు, సీపీఎం కార్యదర్శి, ఆత్మకూరు

మా మొర ఆలకించండి సారూ..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- పోటెత్తిన అర్జీదారులు



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: మా సమస్యలు ఆలకించి పరిష్కరించండి సారూ అంటూ పలువురు వేడుకున్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జేసీ కార్తీక్, డీఆర్వో విజయకుమార్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

దారి లేకుండా చేస్తున్నారు

కక్షగట్టి స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా చేసేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మండలం రామస్వామిపల్లెకు చెందిన ఎర్రగుంట నాగభూషణమ్మ జేసీకి విన్నవించారు. ఆమె మాట్లాడుతూ మా కుటుంబానికి గ్రామంలోని సర్వే నంబర్ 337లో 0.09 సెంట్ల నివాస స్థలం ఉందన్నారు. దానిని ముగ్గురు సోదరులు సమాన భాగాలుగా పంచుకున్నారని చెప్పారు. 0.08 సెంట్ల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం తీసుకున్నట్లు చెప్పారు. మా స్థలం ముందు భాగంలో డొంక పోరంబోకు భూమిలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నీళ్ల ట్యాంక్ నిర్మాణం చేస్తున్నారన్నారు. పక్కన ప్రభుత్వం స్థలం ఉన్నా రాజకీయ కక్షతో తమకు దారి లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కలిసి ఏకపక్షంగా గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే స్థలం అప్పజెప్పారన్నారు. ట్యాంక్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ప్రభుత్వ భూమి ఉన్నా.. కావాలనే మా స్థలానికి అడ్డుగా ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్, ఆర్డీఓను కలిసినా ప్రయోజనం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదిస్తే మాకు స్థలం పంచాయతీ చూపిస్తుందని, అక్కడే నిర్మాణం చేపడతామని తెలిపారన్నారు. న్యాయం చేయాలని కోరారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటూ..

రెండో శనివారం, ఆదివారం కళాశాలలు నిర్వహిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర ఆధ్వర్యంలో నేతలు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, అమర్, నాయకులు సుమంత్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు పెట్టాలి

రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్రాలు లేకపోవడంతో రోజురోజుకూ ధాన్యం ధరలు తగ్గిస్తున్నారని చెప్పారు. ఎంటీయూ 1010 రకం 920 కిలోలు రూ.13 వేలకు, కేఎన్‌ఎం 1638 రకం 920 కేజీలు రూ.16 వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు, వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు..



మాట్లాడుతున్న నాయకులు

ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయడంతోపాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ కోరింది. నేతలు మాట్లాడుతూ యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. దీనిపై స్పందించాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎం.మురళి, వై.పెంచలయ్య, టి.సాంబయ్య, సీహెచ్ ఉష, సీహెచ్ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై..



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాపూరు మండలం రాపూరు గ్రామ పంచాయతీ మద్దెలమడుగు గూడూరు రోడ్డులో ఉన్న సర్వే నంబర్ 1080 ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు వ్యతిరేకంగా లేఅవుట్లు వేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండాపురం వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సీహెచ్‌ఎఫ్‌ఎస్ ఆర్‌టీఓ పట్టా భూముల్ని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు కబ్జా చేసి లేఅవుట్లు వేశారన్నారు.

రైతు సమస్యల్ని పరిష్కరించండి



మాట్లాడుతున్న మాబు

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి నష్ట పరిహారం అందించాలని ఆర్‌పీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలన్నారు. అన్నదాతలను దళారులు దోచుకుంటున్నారని చెప్పారు. నేతలు పట్టపు రంగారావు, బత్తల మధుసూదన్, దుంపల సుబ్బారావు, నంబూరు గణేష్, ఉప్ప నూరు మాలకొండయ్య, తూపిలి వంశీకృష్ణ, బెల్లంకొండ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ అజిత వేజెండ్ల



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైమ్): ప్రజలు అందించే ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ అజిత వేజెండ్ల పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఆమె సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, మహిళా, ఎస్బీ డీఎస్పీలు చెంచురామారావు, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ, మహిళా ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరెడ్డి, టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ అనే వ్యక్తి రూ.34.88 లక్షలు నగదు తీసుకుని మోసగించాడని అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి రూ.3.50 లక్షలు తీసుకుని మోసగించాడని కోవూరుకు చెందిన ఓ యువకుడు వినతిపత్రమిచ్చాడు.
- పాత గొడవలను మనసులో పెట్టుకుని కోటమిట్టకు చెందిన కాలేషా, గౌస్‌బాషాలు తనపై దాడి చేశారని అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- భర్త శివకుమార్‌తో విడాకులు తీసుకున్నా. అయినా నిత్యం తాగొచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడు. గతంలో తీసుకున్న నా వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడు. విచారించి న్యాయం చేయాలని బుచ్చికి చెందిన ఓ మహిళ కోరారు.
- నా ఆస్తిని పిల్లలకు సమానంగా పంచా. నా జీవనోపాధి నిమిత్తం ఉంచుకున్న ఆస్తిని అమ్ముకోనివ్వకుండా, నా బాగోగులు పట్టించుకోకుండా చిన్నకుమారుడు ఇబ్బంది పెడుతున్నాడు. జీవనం కష్టతరంగా మారింది. విచారించి న్యాయం చేయాలని వేదాయపాళేనికి చెందిన ఓ వృద్ధుడు కోరాడు.
- నా భర్త అదనపుకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. రెండో పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తూ ఇంటి నుంచి గెంటేశాడు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని విడవలూరుకు చెందిన ఓ మహిళ కోరారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అన్ని సమస్యలే..



రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

- సమస్యలు పరిష్కారమయ్యే వరకు పెన్‌డౌన్ కొనసాగిస్తాం
- డాక్యుమెంట్ రైటర్లు

నెల్లూరు సిటీ: డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాఫ్ట్‌వేర్ కొత్త అప్‌డేట్ కారణంగా రైటర్లు, క్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓటీపీ, ఆటోమ్యుటేషన్ సమస్యలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యంతోపాటు పదేపదే వాయిదా పడే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు సోమవారం పెన్‌డౌన్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు దీనిని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ విజయరాణికి వినతిపత్రం అందజేశారు.



సబ్ రిజిస్ట్రార్ విజయరాణికి వినతిపత్రం అందజేత

99 మాత్రమే..

డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన పెన్‌డౌన్ వల్ల స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రూ.70 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. రోజూ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. దీంతోపాటు వివిధ సేవలకు రూ.కోటి ఆదాయం వస్తుంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 90 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆర్‌ఓ కార్యాలయంలో 9 మాత్రమే నమోదయ్యాయి. మొత్తంగా రూ.30 లక్షలు మాత్రమే ఆ శాఖకు ఆదాయం వచ్చింది.

అధికారులు స్పందించాలి



ఓటీపీ, ఆటోమ్యుటేషన్ల విధానాల కారణంగా డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓటీపీలు పదేపదే అప్‌లోడ్ చేయడం ద్వారా క్రయదారులు అకౌంట్‌లోని తమ డబ్బులు పోతాయని భయాందోళనకు గురవుతున్నారు. అదే విధంగా సర్వర్ సమస్యతో ఆలస్యమవుతుంది. అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించాలి. లేనిపక్షంలో పెన్‌డౌన్ కొనసాగుతుంది.

– పట్నం దుర్గేష్‌బాబు, దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

అప్‌డేట్ చేస్తేనే..



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సమస్య ఉంది. కొత్తగా అప్‌డేట్ చేసిన సాఫ్ట్‌వేర్‌ను పునరుద్ధరించాలి. క్రయదారులకు ఆలస్యం కాకుండా, సులువైన పద్ధతిలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి.

– పీవీ సుబ్బారావు, డాక్యుమెంట్ రైటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

అసహనానికి గురవుతున్నారు



క్రయదారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఒత్తిడి తెస్తుంటారు. ఈ క్రమంలో స్లాట్‌ల ద్వారా తమ రిజిస్ట్రేషన్లు చేయించుకునే సమయంలో పదేపదే ఓటీపీలు అడగడం, సర్వర్ సమస్యతో ఆలస్యం కావడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు. డాక్యుమెంటర్ రైటర్లపై ఒత్తిడి పడుతుంది.

– జేబీవీ అశోక్, డాక్యుమెంట్ రైటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నగరాధ్యక్షుడు

జల్సాలకు బానిసై చోరీలు

- ఇద్దరు మోటార్‌బైక్‌ల దొంగల అరెస్ట్
- రూ.10 లక్షల విలువైన 11 వాహనాలు స్వాధీనం



బైక్‌ల వద్ద సీఐ వేణు తదితరులు

నెల్లూరు సిటీ: మోటార్‌బైక్‌లు చోరీ చేసి, విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరులోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ వేణు వివరాలు వెల్లడించారు. కోటమిట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ సిద్ధిఖ్, వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీకి చెందిన పఠాన్ రోషన్ మద్యానికి బానిసలయ్యారు. జల్సాలకు డబ్బు లేకపోవడంతో బైక్‌లు ఎత్తుకెళ్లి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు పట్టణాల్లో బైక్ చోరీలకు పాల్పడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సీఐ వేణు, ఎస్సై బి.లక్ష్మణ్, ఏఎస్సై ఎస్‌కే రఫీ, హెడ్‌కానిస్టేబుళ్లు ఆదినారాయణ, చిరంజీవి, కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, మోహన్‌కృష్ణ ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. సోమవారం ధనలక్ష్మీపురం సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.10 లక్షలు విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో నెల్లూరు రూరల్ పరిధిలో ఒక బైక్, కావలి పట్టణంలోని పీఎస్2లో రెండు, పీఎస్1లో ఒకటి, గూడూరు పీఎస్3లో మూడు, గూడూరు పీఎస్2లో రెండు, మరికొన్ని గుర్తుతెలియని బైక్‌లున్నాయి. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.

యువతి హత్య కేసులో ప్రేమికుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ప్రియురాలిని హత్య చేసిన కేసులో ప్రేమికుడిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన మైథిలీప్రియ (23)ను రాపూరు మండలానికి చెందిన నిఖిల్ ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున హత్య చేసిన విషయం తెలిసిందే. మృతురాలి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.రోశయ్య తెలిపారు. నిందితుడు మరో యువతితో సన్నిహితంగా ఉంటూ ప్రియను అడ్డు తొలగించుకునేందుకు రూమ్‌కు పిలిచి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది.

సమస్యలు పరిష్కరించాలంటూ..



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

- విద్యుత్ భవన్ వద్ద నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులోని విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యలపై పలుమార్లు యాజమాన్యానికి, ప్రభుత్వానికి వినతిపత్రాలిచ్చిన పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో 15, 16 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం, 17, 18 తేదీల్లో అన్ని సర్కిల్ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు, 19, 20 తేదీల్లో సర్కిల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు, 22వ తేదీన శాంతియుతంగా ర్యాలీలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు షేక్ అల్తాఫ్, శ్రీనివాసులు, దామోదర్, వెంకటేశ్వర్లు, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, హాజరత్‌వలీ, నాంచారయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా సోమవారం మొదలైంది. వచ్చే నెల 15వ తేదీ వరకు ఇది జరుగుతుంది. మొత్తం 5.18 లక్షల డోసులు వేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వ్యాధి తీవ్రత అధికమైతే పశువులు మరణించే అవకాశం ఉంది. దీనిని మొదటి దశలోనే గుర్తించి పశువైద్యాధికారుల సలహాలు తీసుకుంటే రక్షించుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి

గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ టి.సోమయ్య తెలిపారు. నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లోని పశువైద్యశాలలో సోమవారం పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతులు పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా బుచ్చిరెడ్డిపాళెం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా మార్పు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎక్కువగా నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

జెడ్పీలో ఉద్యోగోన్నతులు

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని వివిధ మండలాల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న 13 మందికి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారికి తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మండలాలు కేటాయిస్తూ సీఈఓ మోహన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సర్పంచ్‌లకు శిక్షణ

జిల్లాలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ ఇస్తామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాటుసారా బట్టీపై దాడులు



పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీని సోమవారం అధికారులు ధ్వంసం చేశారు. బట్టీ గురించి తెలుసుకున్న పోలీసు, అటవీ, ఎక్సైజ్ శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. అలాగే సారా తయారీకి గారికి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. సామగ్రిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. బట్టీ నిర్వహణలో ఎవరి హస్తముందో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కె.ఇంద్రసేనారెడ్డి, ఎ.శ్రీను, ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్, అటవీ శాఖ సిబ్బంది వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.